క్లుప్తంగా

29న ఉమ్మడి జిల్లాస్థాయి భజన పోటీలు

చిన్నచింతకుంట: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని కురుమూర్తిలో శ్రీవీరాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన ఉమ్మడి జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు వీరాంజనేయ భజన మండలి సభ్యులు తెలిపారు. భజన పోటీలను దుర్గాదేవి మండపం వద్ద నిర్వహించనున్నారు. భజన పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 28వ తేదీన సంప్రదించి సాయంత్రం 6గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు 9705174351, 9441627351, 9591376843, 9848322154 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల: స్థానిక పురపాలిక పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. తమకు దసరా పండుగను పురస్కరించుకుని 1వ తేదీనే వేతనాలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు పండుగ, వారాతంపు సెలవులు ఇవ్వాలని, రోడ్లు ఊడ్చుటకు చీపుర్లు, పరికరాలు, చీరలు, డ్రెస్సులు, సబ్బులు, నూనెలు, గ్లౌజులు, మాస్కులు ఇవ్వాలని కోరారు. ఈపీఎఫ్ డబ్బులు కూడా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు ఇందిరమ్మ, కార్యదర్శి వెంకటేశ్, కృష్ణ, విద్యాసాగర్, అంజమ్మ పాల్గొన్నారు.

హన్వాడలో లీగల్ ఎయిడ్ క్లినిక్

హన్వాడ: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో లీగల్‌ఏయిడ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ కిష్యానాయక్ శుక్రవారం తెలిపారు. కార్యాలయంలోని అదనపు గదిలో ఏర్పాటు చేయనున్న లీగల్ ఏయిడ్‌క్లినిక్‌ను జిల్లా ఇన్‌చార్జి జడ్జి కల్యాణ్‌చక్రవర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర చేతుమీదుగా శనివారం ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ప్రతివారం నిర్వహించే ఈలీగల్ ఏయిర్ క్లినిక్‌లో ప్రజలు తమకు ఎదురవుతున్న సమస్యలపై న్యాయపరమైన సూచనలు, సలహాలను పొందేందుకు అవకాశం ఉందన్నారు. అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మిడ్జిల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా భారతి

మిడ్జిల్: రాజాపూర్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న భారతికి మిడ్జిల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు ఇస్తూ శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ యూపీ రాజుకు గుండెపోటు రావడంతో ఆమెకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వగా.. శుక్రవారం విధులలో చేరారు.

కారును ఢీకొన్న కంటైనర్: తప్పిన ప్రమాదం

రాజాపూర్(బాలానగర్): చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి కారులో వెళ్తున్న వారిని ఓ కంటైనర్ ఢీకొనడంతో కారు పూర్తిగా దెబ్బతిని అందులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడ్డ ఘటన శుక్రవారం బాలానగర్ మండల కేంద్రంలో వెలుగు చూసింది. గద్వాల జిల్లా రాజోళికి చెందిన రేపల్లి మహేశ్వరి ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్స చేయించుకునేందుకు స్విఫ్ట్ డిజైర్ కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా.. బాలానగర్‌లో వీరు వెళ్తున్న కారును వెనక నుంచి ఓ కంటైనర్ ఓవర్ టేక్ చేయబోయి ఢీకొనడంతో కారు పూర్తిగా దెబ్బతింది. కారులో ఉన్న మహేశ్వరీతో పాటు రేపల్లె భీసన్నకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు కారులో ఉన్నవారిని బయటకు తీశారు. విషయం తెలిసిన ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ అక్కడి చేరుకుని ప్రమాదానికి కారణమైన కంటైనర్‌తోపాటు డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉర్దూఘర్ వద్దని వినతి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అంబేడ్కర్ కళాభవన్ ప్రాంగణంలో ఉర్దూఘర్‌తోపాటు వేరే నిర్మాణాలకు స్థలం ఇవ్వొద్దని అంబేడ్కర్ కళాభవన్ పరిరక్షణ కమిటీ ఉమ్మడి జిల్లా చైర్మన్ సింగిరెడ్డి పరమేశ్వర్, కన్వీనర్ పాతూరు రమేశ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర క్రీడల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డిని జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్, గోపాలకృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.

నీటి ప్రవాహాల వద్దకు వెళ్లరాదు

కోస్గి రూరల్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు నీటి ప్రవాహాలకు వద్దకు వెళ్ళరాదని కోస్గి సిఐ సైదులు అన్నారు. శుక్రవారం మండలంలోని ముశ్రీపా వాగు , బిజ్జారం వాగు ముంగిమళ్ల కత్వ విపరీతంగా వరదతో ప్రహహిస్తున్న వాటిని పరిశీంచారు. వాతావరణ పరిస్థితుల వల్ల రాబోయే 24 గంటలు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, చేపల వేటకు, పురాతన ఇళ్లల్లో నివసించవద్దని, పిల్లలు ఈత కొట్టడం, ఫొటోలు దిగే సమయదంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు


బ్రాహ్మణవాడిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వనదుర్గ దేవి రూపంలో అమ్మవారు


అమిస్తాపూర్‌లో సాక్షి గణపతి ఆలయంలో లక్ష్మీదేవి అలంకరణలో దుర్గాదేవి


కురుమూర్తిలో అమ్మవారికి 5.25 లక్షల నోట్లతో అలంకరించిన భక్తులు


దేవరకద్రలో వాసవీమాతను లక్ష్మీదేవిగా అలంకరించిన దృశ్యం

సాక్షి, నెట్‌వర్క్: దసరా నవరాత్రి ఉత్సవాలను జిల్లా కేంద్రంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రాహ్మణవాడిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని వనదుర్గదేవి రూపంలో అలంకరించారు. మహిళా భక్తులు కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు లక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా సింహగిరిలోని లక్ష్మీ నరసింహ ఆలయ ప్రాంగణంలోగల శ్రీకామేశ్వరి సమేత ఐశ్వర్యేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. పంచముఖి ఆంజనేయస్వామి ఆయం, బస్టాండ్ సమీపంలోని ద్వారా కామాయి బాబా మందిరంతోపాటు పలు ఆలయాల్లో దేవీశరన్నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు.

❒ కాళికాదేవి ఆశీస్సులు అందరిపైన ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో కొలువైన కాళికాదేవి మూలవిరాట్‌ను ఎమ్మెల్యే దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ విజయదశమి పండుగ ప్రతిఇంటికి సుఖసంతోషాలు తీసుకురావాలని అమ్మవారిని కోరారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

❒ జిల్లా కేంద్రం రవీంద్రనగర్‌లో వెలిసిన శ్రీశీతలాదేవి (పోచమ్మ) ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఐదో రోజు శుక్రవారం అమ్మవారిని రూ.63,28,973లతో మహాలక్ష్మీదేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డులోని జ్ఞానగిరి గుట్టలో వెలిసిన విజ్ఞాన సరస్వతీదేవిని శుక్రవారం లక్ష్మీదేవి రూపంలో అలంకరించారు.

❒ నవాబుపేట మండలంలోని కొల్లూర్ పరిధిలోని సత్రోనిపల్లితండాలో శుక్రవారం బంగారు మైసమ్మ బోనాలు నిర్వహించారు. కొల్లూర్‌తోపాటు గిరిజన తండాలు పెద్ద ఎత్తున బోనాలు, శకటోత్సవాలతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగే బోనాలు నేటితో ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున బోనాలు, శకటోత్సవాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు రఘు, రాజు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తులసీరాంనాయక్, చందర్‌నాయక్, సేవ్యానాయక్, ఖాజా, నర్సింహాచారి, వాసుయాదవ్, రామకృష్ణ, లింభ్యానాయక్, కృష్ణయ్యగౌడ్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

❒ చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తిలో ప్రతిష్ఠించిన అమ్మవారు ఐదోరోజు శుక్రవారం మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు 5.25లక్షల నోట్లతో అమ్మవారికి అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

❒ భూత్పూర్ మున్సిపాలిటీలోని భూత్పూర్, అమిస్తాపూర్, షిర్డిసాయి మందిరంతోపాటు మండలంలోని అన్నాసాగర్, రావులపల్లి, పాతమొల్గర, పోతులమడుగులో శుక్రవారం దుర్గాదేవిని లక్ష్మీదేవిగా అలంకరించారు. హోమం, కుంకుమార్చన, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

❒ రాజాపూర్ మండల కేంద్రంతోపాటు పరిధిలోని రాయపల్లి, తిర్మలాపూర్, రంగారెడ్డిగూడ, చొక్కంపేట్, మల్లేపల్లి తదితర గ్రామాల్లో మహాలక్ష్మిదేవికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు.

❒ దేవరకద్రలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని మహాలక్ష్మీదేవి రూపంలో, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని వాసవీమాతను లక్ష్మీదేవి అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్ర పారాయణం, పల్లకీసేవను నిర్వహించారు. లక్ష్మీపల్లిలోని కనకదుర్గాదేవి ఆలయంలో మహాలక్ష్మీగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు.

మహిళల ఆర్థిక సాధికారతకు కృషి

● ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి


మొబైల్ క్యాంటీన్ వాహనాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట/అడ్డాకుల: మహిళల సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దమగ్నాపురంలో ఇందిరా మహిళ శక్తి పథకంలో భాగంగా దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్‌కు చెందిన అబ్ధిదారులు మబీనా బేగంకు మొబైల్ క్యాంటిన్ వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరా మహిళ శక్తి పథకం ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం దేవరకద్ర మండలం మీనుగోనిపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు పలువురు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మూసాపేట మండలం పోల్కంపల్లి మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డితోపాటు 100మంది కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్, మాజీ ఎంపీపీ కృష్ణయ్య, యాదయ్య, రాములుయాదవ్, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

మిల్లీమహాజ్ ఆధ్వర్యంలో నిరసన

స్టేషన్ మహబూబ్‌నగర్: కొడంగల్‌లో తొలగించిన చిల్లా ముబారక్, ముస్లింల సమాధులు, అషుఖానాలను వెంటనే అదే స్థలంలోనే పునుద్ధరించాలని మిల్లీమహాజ్ మహబూబ్‌నగర్ కన్వీనర్ తఖీ హుస్సేన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జామీయా మజీద్ ఎదుట శుక్రవారం జుమా నమాజ్ అనంతరం మిల్లీ మహాజ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తఖీ హుస్సేన్ మాట్లాడుతూ.. సీఎం నియోజకవర్గంలో ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని తెలిపారు. దీనికి బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిరసనలో తయ్యబ్ బాష్వార్, అబ్దుల్లా సున్నీ, మహ్మద్ అహ్మద్ అలీ సనా, మహ్మద్ నయీమ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను క్రమం తప్పకుండా పంపించాలి

మిడ్జిల్: కళాశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా కళాశాలకు పంపించాలని జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మీ పిల్లలు మంచిగా చదువుకోవాలంటే, రోజు కళాశాలకు పంపించి, ఎలా చదువుతునారో తెలుసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలు మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు పేరు తెవాలని సూచించారు. అధ్యాపకులు విద్యార్థులకు మంచిగా బోధించాలని, వారిని ఉన్నత స్థాయికి తీసుకొచ్చి కళాశాలకు మంచి పేరు తెవాలని సూచించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, మాజీ ఎంపీటీసీ గౌస్, నాయకులు రాజేశ్వర్, జహంగీర్, రవీందర్, జంగిలయ్య, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను పరిశీలించిన ఎస్పీ


ట్యాంక్ బండ్ పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ క్రైం: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెరువులను శుక్రవారం సాయంత్రం ఎస్పీ జానకి పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా వస్తున్న వర్షాల కారణంగా పెద్ద చెరువు, ఎర్రగుంట చెరువు, ట్యాంక్ బండ్‌ను పరిశీలిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సీఐ అప్పయ్యకు ఆదేశాలు ఇచ్చారు. ట్యాంక్ బండ్ నీటి ప్రవాహం పెరిగితే తక్షణ చర్యలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జేపీఎన్‌సీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల అందజేత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు హైటెక్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి చేతుల మీదుగా విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం గొప్ప విషయమని, సమయం వృథా చేయకుండా భవిష్యత్‌పై దృష్టిపెట్టి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జేపీఎన్‌సీ కళాశాల చైర్మన్ రవికుమార్, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, కంట్రోలర్ సందీప్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు


గండేడ్ ప్రజావేదికలో పాల్గొన్న అడిషనల్ డీఆర్‌డీఓ ముసాయిదాబేగం

గండేడ్: ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని అడిషనల్ డీఆర్‌డీఓ ముసాయిదాబేగం పేర్కొన్నారు. ఇటీవల ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. 2024 ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 31వరకు ఉమ్మడి గండేడ్ మండలంలోని 49 జీపీల్లో జరిగిన పనులకుగాను ఎస్‌ఆర్‌పీలు, డీఆర్‌పీలు తనిఖీ చేశారు. దీనిపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. గండేడ్, మహమ్మదాబాద్ ఎంపీడీఓలు హరిశ్చంద్రారెడ్డి, నరేందర్‌రెడ్డి సమక్షంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కొనసాగింది. ఇందులో భాగంగా గండేడ్, మహమ్మదాబాద్ మండలాల పరిధిలోని ఆన్నారెడ్డిపల్లి, మహమ్మదాబాద్, కంచన్‌పల్లి, నల్కర్‌పేట్, రుసుంపల్లి, చెన్నాయిపల్లి, పెద్దవార్వాల్, సాలార్‌నగర్ తదితర గ్రామాలకు సంబంధించి మొదటి రోజు సామాజిక తనిఖీ కొనసాగింది. వివిధ రకాల అక్రమాలకు పాల్పడిన వారినుంచి రికవరీతోపాటు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సామాజిక తనిఖీలో జిల్లా విజిలెన్సు ఆఫీసర్ ప్రేమలత, అంబుడ్స్‌మెన్ సంతోష్, ఏపీఓ హరిశ్చంద్రుడు, ఆయా గ్రామాల టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గండేడ్: గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో భారీ వర్షాల నేపథ్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల పోలీసు, రెవెన్యూ, ఎంపీడీఓ, ఇరిగేషన్, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులు ఎక్కడ ఏం జరుగుతుందో పర్యవేక్షించాలన్నారు. ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ యాసిన్, ఇరిగేషన్ వర్క్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మయ్య, జీపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ ఫ్రెషర్స్ పార్టీ


నృత్యం చేసిన చిన్నారులను అభినందిస్తున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. ఐసీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు అపూర్వ అవకాశాలు ఉన్నాయని, రీసెర్చి చేయడంతోపాటు ఫార్మా రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతి కార్యక్రమంలో పలువురు చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఓడీ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, రామ్మోహన్, శ్రీధర్‌రెడ్డి, సిద్ధ రామగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ ఆశయాలను కొనసాగించాలి


మాట్లాడుతున్న బీపీ మండల్ విగ్రహ ప్రతిష్ఠ కమిటీ చైర్మన్ శాంతన్న

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీల ఆరాధ్యుడు, సమస్త బీసీ కుల రిజర్వేషన్ పితామహుడు బిందేశ్వర్ ప్రసాద్ మండల్ ఆశయాలను కొనసాగించాలని బీపీ మండల్ విగ్రహ ప్రతిష్ఠ కమిటీ చైర్మన్ శాంతన్న అన్నారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28వ తేదీన జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్ట్‌లో బీపీ మండల్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. బీసీలు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్ యాదవ్, సాయిలుయాదవ్, నర్సింహులు, అంజన్న, నారాయణ, లక్ష్మీనారాయణ, రాజగోపాల్, రమేశ్, శ్రీనివాస్, వెంకటేశ్, శ్రీను, రమేశ్‌యాదవ్, ఊషన్న, యాదయ్య, గోవిందు, రాఘవేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయ సాధనకు పాటుపడుదాం

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మెట్టుగడ్డ: భూమి కోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తికి పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ జయంతికి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్ట్‌లో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, అంజయ్య, రజక సంఘం నాయకులు మల్లేశ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

❒ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఎంసీ అజ్మీర రాజన్న, మేనేజర్ వెంకటేశ్వరరావు, ఆర్ఓలు సిబ్బంది పాల్గొన్నారు.

❒ పట్టణ రజక సంఘం అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రీన్‌బెల్ట్‌లోని ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

❒ జెడ్పీసెంటర్‌లోని (మహబూబ్‌నగర్) రైల్వేస్టేషన్ చౌరస్తాలో ఐలమ్మ చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ముడా మాజీ చైర్మన్ వెంకన్న, బెక్కం జనార్దన్, శివరాజు, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నగేశ్, అనంతరెడ్డి, గణేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

❒ గండేడ్ మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం ఆధ్వర్యంలో పులమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఐలమ్మ జయంతి నిర్వహించారు.

❒ మహమ్మదాబాద్ మండల కేంద్రంలో రజక సంఘం అధ్యక్షుడు రిటైడ్ హెచ్‌ఎం రాములు అధ్యక్షతన ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

❒ జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత పూలమాల వేసి నివాళుర్పించారు. మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

❒ నవాబుపేట మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఐలమ్మ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్, డీటీ సువర్ణ, గాయిత్రీ, ఏపీఓ జ్యోతి, ఏపీఎం శ్రీహరి, పంచాయతీ అధికారులు నరేశ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

❒ భూత్పూర్ మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో శుక్రవారం ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజకసంఘం నాయకులు పాల్గొన్నారు.


గ్రీన్‌బెల్ట్‌లోని ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎంసీ రాజన్న

ఎడతెరిపిలేని ముసురు వాన


ఉధృతంగా అలుగుపారుతున్న సాలార్‌నగర్ ప్రాజెక్టు

● పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
● స్తంభించిన జనజీవనం

హన్వాడ: అల్పపీడన ప్రభావంతో కురుస్తోన్న వర్షాలతో మండలంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. శుక్రవారం తెల్లవారుజాము 4గంటలకు ప్రారంభమైన వర్షం రోజంతా వర్షపు జల్లులతో మండలం మొత్తం తడిసిముద్దయింది. ఎక్కడ చూసినా వర్షపునీటితో నిండిన ప్రాంతాలన్నీ జలమయమై కుంటలను తలపిస్తున్నాయి. వర్షం కారణంగా ప్రజలు తమ పనులను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఇంటిపట్టునే కూర్చోవాల్సి వచ్చింది. చిన్నపాటి గుంతల్లో నీరునిలచి కుంటలను తలపిస్తోన్నాయి. మైసమ్మ అడవుల నుంచి వచ్చే కోయిల్‌సాగర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మునిమోక్షం, గొండ్యాల్ గుండా వెళ్లే వాగు వంతెనల పైనుంచి ప్రవహించాయి. బుద్దారం చెరువు అలుగు ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా ఆగ్రామ ప్రజలు మండల కేంద్రానికి రాలేని పరిస్థితి లేకుండాపోయింది. తాజాగా మరోసారి చెరువులు, కుంటలు అలుగులు పొంగి పొర్లుతున్నాయి. మరోమారు మండలంలో జలకళ సంతరించుకున్నట్లయింది.

గండేడ్: శుక్రవారం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. చెరువులు కుంటలు స్థాయికి మించి అలుగు పారుతూ ప్రమాదకర స్థాయికి చేరాయి. పలుచోట్ల రాకపోకలకు అంతరాయం కలగడంతోపాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గండేడ్ మండలంలోని సాలార్‌నగర్ ప్రాజెక్టు స్థాయికి మించి అలుగుపారుతుంది. రంగారెడ్డిపల్లి వద్ద పాత బ్రిడ్జిని తాకుతూ పెద్దవాగు ఉధృతంగా ప్రవహించింది. వెన్నాచేడ్ పెద్దచెరువుకు వరద పోటెత్తింది. పరిగి రంగారెడ్డిపల్లి రూట్లో చెల్మిల్ల గేటు వద్ద రోడ్డుపై నుంచి ప్రమాదకరంగా నీరుపారడంతో మధ్యాహ్నం నుంచి రాకపోకలు నిలిపోయాయి. జిన్నారం–చెల్లిల్ల మధ్య వెన్నాచేడ్ వాగు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దోశోని కాల్వ వద్ద పెద్దచెరువు నీరు అలుగ ఉధృతంగా పారుతుండడంతో వాగుకు అవతలి వైపు ఉన్న ఇళ్లకు రాకపోకలకు స్తంభించాయి. పీర్లబండతండా వద్ద కాజువేపై నుంచి నీరు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రం వరద తగ్గుముఖం పట్టినా ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయించారు. పెద్దవార్వాల్‌లో నీరటి అంజయ్యకు చెందిన మట్టి ఇల్లు కూలింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ఆర్‌ఐ యాసిన్ కూలిన ఇంటిని పరిశీలించారు. తహసీల్దార్ మల్లికార్జున్ రావు, ఎస్సై శేఖర్‌రెడ్డి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

దేవరకద్ర: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు దేవరకద్ర మున్సిపాలిటీలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాయిచూర్ రహదారి పక్కనున్న కాలనీలలో నీరు నిలిచి కుంటను కనిపిస్తుంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాయం వెళ్లే రహదారికి ఇరువైపులా నివాసాలన్నీ నీటిలో కనిపిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడి కక్కడ నీరు నిలిచి పోతున్నది. కొత్త బస్టాండ్ చౌరస్తాలో, కోయిల్‌సాగర్ రోడ్‌లోని నివాసాల మధ్య భారీగా వర్షం నీరు నిలిచిది.

పెద్దవాగుకు పోటెత్తి వరద

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించి ఉన్న పెద్దవాగుకు శుక్రవారం వరద పోటెత్తింది. వాగు ఎగువ ప్రాంతంలో అర్ధరాత్రి నుంచి వర్షం కురవడంతో వాగులో వరద ఉధృతి పెరిగింది. పోల్కంపల్లి, తిమ్మాపూర్, నిజాలాపూర్, కొమిరెడ్డిపల్లి, కందూర్, పొన్నకల్, రాచాల, ముత్యాలంపల్లి, బలీదుపల్లి గుండా పెద్దవాగు జలాలు వనపర్తి జిల్లా మదనాపురం మండలం శంకరమ్మపేటలోని సరళాసాగర్ ప్రాజెక్టుకు చేరుతున్నాయి. రెండు మండలాల్లోని చెరువులు, కుంటలు అలుగు పారుతుండగా ఆ జలాలు పెద్దవాగులో చేరుతున్నాయి. రెండు మండలాల పరిధిలో నిర్మించిన చెక్‌డ్యాంలు నిండుగా అలుగు పారుతున్నాయి.

భూత్పూర్: పట్టణంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షంతో రహదారి జలమయమైనది. బ్రిడ్జికి ఇరువైపులా నాసిరకంగా డ్రైనేజీల నిర్మాణం చేపట్టడంతో వర్షం కురిసిన ప్రతిసారి రహదారిపై నీరు చేరి వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటర్నల్ రహదారిలో రోడ్డు నుంచి వచ్చే వర్షం నీరుకు బ్రిడ్జి వద్ద మట్టి, గడ్డి మొలవడంతో నీరు వెళ్లలేక రహదారిపై నిలుస్తుంది. ఎల్‌అండ్ టీ అధికారులు పర్యవేక్షణ లోపంతో డ్రైనేజీల్లో మట్టి పెరకపోవడంతో నీరు రహదారిపైనే ఉంటుంది. అధికారులు చొరవ తీసుకొని రహదారిపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మహమ్మదాబాద్: కురుస్తున్న భారీ వర్షానికి మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల చెరువులు ప్రమాదకరంగా అలుగులు పారుతూ వాగులు వంకలు తీవ్రరూపం దాల్చాయి. గురువారం రాత్రి ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా కురువడంతో మహమ్మదాబాద్ మల్కచెరువు, బ్రాహ్మణ్‌చెరువు, మొకర్లాబాద్ లింగమయ్య చెరువు, గాధిర్యాల్ ఏటి చెరువు, ఊరచెరువుతోపాటు జూలపల్లి, నంచర్ల చెరువులు అలుగులు పారుతూ పలు ప్రాంతాలు జలయమమయ్యాయి. గాధిర్యాల్‌కు చుట్టూ ఉన్న ఏటిచెరువు అలుగు, ఊరచెరువు అలుగు, ఉత్తరోని వాగుల ప్రవాహం తీవ్రరూపం దాల్చడంతో ఉన్న మూడుదారులు గ్రామాన్ని జలదిగ్బంధంలో పడేశాయి. గ్రామం నుంచి వాహనాలు బయటకు వెళ్లలేక బయటి వాహనాలు గ్రామంలోకి రాలేక ప్రజలు వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు నానా అవస్థలు పడ్డారు. వాగుల దగ్గర పలువురు యువకులు చేరుకుని అత్యవసరంగా వెళ్లే వారిని వాగులు దాటిస్తూ వారికి సహాయం చేశారు.


గాధిర్యాల్‌లో అలుగు పారుతున్న ఏటిచెరువు


మునిమోక్షం వద్ద వంతెనపై నుంచి ఉధృతంగా పారుతున్న వాగు


వాగు దాటి రావద్దని పోలీసులు బుద్దారం వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరికబోర్డు